




తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక








ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :58 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 10, వెల. 6రూ/ 29 శనివారం నవంబర్ 2025




## ప్రజాసేవలో 'జననాయకుడి'

# ముద్ర



- ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ నూతన శకం
- పాలనలో వేగం- సంక్షేమంలో స్పష్టత
- నవశకానికి దిక్సూచి పవన్ కల్యాణ్ పాలన దక్షత

2

అక్షరవిజేత,ఎడిటర్ డా.బి,అనిల్ కుమార్ అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ , తనదైన శైలిలో పాలనా విధుల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, ప్రజల్లో ఒక నమ్మకాన్ని, భరోసాను నింపుతున్నారు. కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా, ఒక ప్రజా సేవకుడిగా తన పాత్రను బలంగా పోషిస్తూ, సంకీర్ణ ప్రభుత్వంలో కీలకమైన తన శాఖల ద్వారా నూతన ఒరవడిని సృష్టిస్తున్నారు.




## ఏపీకి ప్రధాని మోదీ

# పూర్తి సహకారం ఉంటుంది

- అమరావతి పునఃప్రారంభంపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ హర్షం
- రాజధానిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థల కార్యాలయాలకు శంకుస్థాపన
- రైతుల త్యాగాన్ని మరువొద్దని, వారికి బ్యాంకులు అండగా నిలవాలని పిలుపు
- రాష్ట్రంలో ఏఐ, క్వాంటం వ్యాలీ, ఆస్ట్రో ఫిజిక్స్ ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు

2

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభం కావడం సంతోషకరమని, ఇది ఒక యజ్ఞం లాంటిదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశంలో ఒక కొత్త రాజధాని నగరాన్ని నిర్మించడం సామాన్య విషయం కాదని, ఈ బృహత్కార్యానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో 15 ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె ప్రసంగించారు.

## ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించిన

# ప్రధాని మోదీ

- -గోవాలో 77 అడుగుల శ్రీరాముడి విగ్రహం
- -ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రాముడి విగ్రహంగా గుర్తింపు
- -'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' శిల్పి రామ్ సుతార్ రూపకల్పన
- -ఉడిపిలో లక్ష కంఠ గీతా పారాయణంలో పాల్గొన్న ప్రధాని
- -ఉడిపి సుపరిపాలన నమూనాను గుర్తు చేసుకున్న మోదీ



2

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం దక్షిణ గోవాలో పర్యటించి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పార్తగాలిలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ్ మఠంలో ఏర్పాటు చేసిన 77 అడుగుల ఈ భారీ కంచు విగ్రహాన్ని ఆయన జాతికి అంకితం చేశారు. విగ్రహావిష్కరణ అనంతరం ప్రధాని మఠంలోని ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, వేద మంత్రోచ్చారణల మధ్య జరిగింది.గుజరాత్‌లోని 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' (ఐక్యతా విగ్రహం) రూపశిల్పి రామ్ సుతార్ ఈ శ్రీరాముడి విగ్రహాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు.



## అమరావతి రెండో దశ భూ సమీకరణకు

# ఏపీ కేబినెట్ ఆమోదం

- -ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాల సేకరణకు నిర్ణయం
- -ప్రభుత్వ భూమితో కలిపి మొత్తం 20 వేల ఎకరాలు సమీకరించాలని లక్ష్యం

2

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రెండో దశ భూ సమీకరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు.

## పిన్నెల్లి సోదరులకు సుప్రీంకోర్టులో

# చుక్కెదురు

- -ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- -అరెస్ట్‌పై గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కూడా ఎత్తివేత
- -లొంగిపోయేందుకు సమయం కోరిన నిందితుల తరపు న్యాయవాది

2




## భారత్‌కు

# వస్తున్న పుతిన్...

## పర్యటన తేదీలు ఖరారు

- -డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్న పుతిన్
- -వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్న రష్యా అధ్యక్షుడు
- -ప్రధాని మోదీతో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు
- -పుతిన్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక విందు

2



# ప్రజా సేవలో 'జన నాయకుడి' ముద్ర

**సమర్థవంతమైన పాలన**

**కీలకమైన శాఖలలో కార్యాచరణ**

ఉప ముఖ్యమంత్రి హోదాలో ఆయన నిర్వహిస్తున్న పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ మరియు పర్యావరణం, విజ్ఞాన మరియు సాంకేతికత శాఖలు రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభాలుగా ఉన్నాయి. ఈ శాఖల్లో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలు పాలనలో పారదర్శకత, వేగం పెంచడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**గ్రామీణాభివృద్ధిపై దృష్టి**

గ్రామ స్వరాజ్యం అనే తన చిరకాల లక్ష్యం దిశగా పవన్ కల్యాణ్ అడుగులు వేస్తున్నారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పన, నిర్మలమైన తాగునీటి సరఫరా కోసం ప్రత్యేక ప్రణాళికలను వేగవంతం చేస్తున్నారు.

**పర్యావరణ పరిరక్షణ**

అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రిగా, రాష్ట్రంలో అడవుల పెంపకం, పచ్చదనం విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండేందుకు, పారిశ్రామికీకరణ మరియు అభివృద్ధి మధ్య సమన్వయాన్ని పాటించడంలో ఆయన కృషి స్పష్టంగా కనిపిస్తోంది. నిర్ణయాలలో పవన్ మార్కు వినూత్న కార్యక్రమాలు పవన్ కల్యాణ్ పాలనలో స్పష్టంగా కనిపిస్తున్న పవన్ మార్కు.

**క్షేత్రస్థాయి పర్యటనలు**

ఆయన కేవలం ఫైళ్లు, సమీక్షలకు మాత్రమే పరిమితం కాకుండా, సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి గ్రామ స్థాయి లో పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది ప్రజలకు మరింత చేరువయ్యేలా, వాస్తవ సమస్యల పరిష్కారానికి దారి తీస్తోంది.

**జవాబుదారీతనం**

ప్రభుత్వ అధికారులలో జవాబుదారీతనాన్ని, సకాలంలో పనులు పూర్తి చేయాలనే నిబద్ధతను పెంచేందుకు ఆయన కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇది పాలనలో దక్షత పెరగడానికి దోహదపడుతుంది.

**యువతకు స్ఫూర్తి**

సాంకేతికతను పాలనలో వినియోగించడం ద్వారా, యువతరం ఆలోచనలను, నైపుణ్యాలను ప్రభుత్వ కార్యక్రమాలలో భాగం చేయడానికి కృషి చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ పనితీరు రాష్ట్ర పాలనలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. ఆయన అనుసరిస్తున్న నిజాయితీ, నిబద్ధత తో కూడిన పాలన పద్ధతులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణ అనే మూడు లక్ష్యాలను సాధించడానికి మార్గం సుగమం చేస్తోంది. ఆయన సేవలు, ప్రజా సంక్షేమం పట్ల ఆయనకున్న అచంచలమైన విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్నాయి.

# పిన్నెల్లి సోదరులకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

పల్నాడు జిల్లాలో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో వారు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. పిన్నెల్లి సోదరులు ముందస్తు బెయిల్‌కు అర్హులు కాదని జస్టిస్ సందీప్ మెహతా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో వారి అరెస్ట్‌పై విధించిన మధ్యంతర ఉత్తర్వులను కూడా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో లొంగిపోయేందుకు తమకు కొంత సమయం ఇవ్వాలని పిన్నెల్లి సోదరుల తరపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. ఈ ఏడాది మే 24న గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తెలంగాణలోని హుజూర్‌నగర్‌లో ఓ వివాహ వేడుకకు హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా ఈ దారుణం జరిగింది. వెల్దుర్తి మండలం బొదిలవీడు వద్ద వీరిని స్కార్పియో వాహనంతో ఢీకొట్టారు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావును రాయితో కొట్టి చంపినట్లు పోలీసులు తమ దర్యాప్తులో తేల్చారు. ఇది ప్రమాదం కాదని, హత్యేనని స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, మృతుల బంధువులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొత్తం ఏడుగురిని నిందితులుగా చేర్చగా, ఏ-6గా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ-7గా ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ఉన్నారు. అరెస్టు భయంతోనే వారు ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, తాజాగా వారి పిటిషన్ తిరస్కరణకు గురైంది.

# ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ

ఎంతో ఘన చరిత్ర కలిగిన గోకర్ణ జీవోత్తమ్ మఠం భారతదేశంలోని పురాతన మఠాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక సేవలో ఈ మఠం పాత్ర ఎనలేనిది. ముఖ్యంగా సారస్వత బ్రాహ్మణ సమాజంలో ఈ మఠానికి విశిష్ట స్థానం ఉంది. మఠం స్థాపించి 550 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నవంబర్ 27 నుంచి డిసెంబర్ 7 వరకు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 370 ఏళ్ల క్రితం గోవాలోని కనకోనా ప్రాంతంలోని పార్తగాలి గ్రామంలో ఈ మఠ ప్రాంగణాన్ని నిర్మించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ 7,000 నుంచి 10,000 మంది భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. గోవా పర్యటనకు ముందు, ప్రధాని మోదీ కర్ణాటకలోని ఉడిపిలో పర్యటించారు. ఉడిపి శ్రీకృష్ణ మఠంలో నిర్వహించిన 'లక్ష కంఠ గీతా పారాయణం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లక్ష మంది విద్యార్థులు, పండితులు, సన్యాసులు, సాధారణ పౌరులతో కలిసి భగవద్గీత శ్లోకాలను పఠించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ గర్భగుడి ఎదుట నిర్మించిన సువర్ణ తీర్థ మంటపాన్ని ప్రారంభించారు. అలాగే, కనకదాసు శ్రీకృష్ణుడిని దర్శించుకున్న పవిత్ర కిటికీ 'కనకన కిండి'కి బంగారు కవచాన్ని (కనక కవచం) సమర్పించారు.

# భారత్‌కు వస్తున్న పుతిన్...

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన ఖరారైంది. 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఆయన డిసెంబర్ 4, 5 తేదీల్లో భారతదేశంలో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు పుతిన్ భారత్‌కు వస్తున్నారని, ఈ పర్యటన తేదీలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. రష్యా వార్తా సంస్థ క్రెమ్లిన్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. ఈ పర్యటనలో భాగంగా పుతిన్ ఢిల్లీలో ప్రధాని మోదీతో కీలక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం, వాణిజ్యం సహా పలు కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. ఈ సదస్సు రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. రష్యా అధ్యక్షుడు పుతిన్ గౌరవార్థం ప్రత్యేక విందును ఏర్పాటు చేయనున్నారు. ఈ విందుకు ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు కూడా హాజరవుతారు. ఈ శిఖరాగ్ర సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య సహకారానికి స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుందని, ఇది ఉభయ దేశాల పురోగతికి ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు.

# ఏపీకి ప్రధాని మోదీ పూర్తి సహకారం ఉంటుంది

భవిష్యత్ రాజధానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలు (పీఎస్‌యూ) తమ ప్రధాన కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఒకేచోట ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 15 బ్యాంకులు, బీమా సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. రాజధాని నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులను ఎన్నటికీ మర్చిపోకూడదని, వారి ప్రయోజనాలను కాపాడటం బ్యాంకుల బాధ్యత అని గుర్తుచేశారు. బ్యాంకులు కేవలం కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు ఇవ్వడానికే పరిమితం కాకుండా, రైతుల ఉత్పత్తులకు మార్కెటింగ్, ప్యాకింగ్, కోల్డ్ చెయిన్ వంటి సౌకర్యాలు కల్పించే పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా రాయలసీమలోని 9 జిల్లాల నుంచి ఉద్యాన ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల మార్కెట్లకు తరలించడానికి బ్యాంకులు సహకరించాలని పిలుపునిచ్చారు. దేశంలో గత పదేళ్లలో 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖ నుంచి బయటకు తీసుకువచ్చామని, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలు కూడా పెరుగుతున్నాయని నిర్మల వివరించారు. ఈ మార్పులకు అనుగుణంగా బ్యాంకులు భవిష్యత్ ఆలోచనలతో, సమీకృత ఐడియాలతో పనిచేయాలని సూచించారు. గతంలో 'మహిళా సఖి' పేరుతో మహిళలను బీమా ఏజెంట్లుగా మార్చే కార్యక్రమం అద్భుత ఫలితాలు ఇచ్చిందని గుర్తుచేశారు. విభజన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా అండగా నిలవాలని ప్రధాని మోదీ ఎప్పుడూ చెబుతుంటారని, ఏపీ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆయన తక్షణమే ఆమోదం తెలుపుతారని అన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని క్వాంటం వ్యాలీ, ఏఐ ప్రాజెక్టుల కోసం జిల్లాల్లో ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేవలం ఐటీ మాత్రమే కాకుండా, ఆస్ట్రో ఫిజిక్స్ వంటి రంగాల్లోనూ ఏపీని ముందుకు తీసుకెళ్తున్నామని, ఇందులో భాగంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం సంతోషకరమన్నారు. ఆచార్య నాగార్జునుడు వంటి గొప్ప శాస్త్రవేత్తలు నడయాడిన ఈ గడ్డపై, అమరావతిలో ఒక కాస్మోస్ ప్లానెటోరియం నిర్మిస్తుండడం హర్షణీయమని అన్నారు. రానున్న ఏడాదిన్నర కాలంలో ఆంధ్రప్రదేశ్ ఒక ఫ్యూచరిస్టిక్ కేపిటల్ నగరంగా రూపుదిద్దుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రేర్ ఎర్త్ మినరల్స్‌పై కీలక నిర్ణయం తీసుకుందని, ఈ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కూడా ఏపీ కృషి చేయాలని నిర్మలా సీతారామన్ కోరారు.

# నేడే కందుకూరు పట్టణ ప్రజల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

కందుకూరు,

కందుకూరు ప్రజల అభీష్టం మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాకు విలీనం చేసిన సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకి కందుకూరు పట్టణ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించబడునని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు తెలిపారు.

# టిడిపిని బలోపేతం చేయండి..

## - రాష్ట్ర కార్యదర్శి భాస్కర్..

వెలిగండ్ల, :

రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడానికి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పోలింగ్ బూతులు వారీగా ఇన్చార్జిలు నియమించడం జరిగిందని శుక్రవారం వెలిగండ్ల మండల పర్యటనలో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు ఇంద్రభూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన రాష్ట్ర పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ శ్రేణులను మండల పరిధిలోని 31 34 38 43 పోలింగ్ బూతులలో పార్టీమెజార్టీ తక్కువగా రావటానికి గల కారణాలపై ఆరా తీయడం జరిగినది. త్వరలో జరగబోవు స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీని అందరు కలిసికట్టుగా పనిచేసి మంచి మెజారిటీ తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బడుగులకు విద్య ప్రధాత జ్యోతిబాపూలే

అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :

సామాజిక విప్లవ కారులు, సంఘ సంస్కర్త,బడుగులకు విద్య ప్రదాత, బీసీల జాతి పిత మహాత్మ జ్యోతిబాపూలే 135వ వర్ధంతి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరం లోని హనుమాన్ జంక్షన్ విగ్రహాల పార్క్ లో గల మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే కేవలం బడుగు బలహీనవర్గాలకె సేవ చేయలేదని గుర్తు చేశారు. సమాజంలో వెనుకబడిన ప్రతి ఒక్కరి గురించి పోరాడిన గొప్ప నాయకుడు మహాత్మ జ్యోతిబాపూలే అని పేర్కొన్నారు. అగ్రవర్ణాల పేదలకు, వితంతువుల కొరకు, ఎస్సీ, ఎస్టీ, బిసి ఇలా ప్రతి జాతి కొరకు, ప్రతి కులం వారి కొరకు పోరాడిన ఏకైక వ్యక్తి మహాత్మ జ్యోతిబాపూలే అని గుర్తు చేశారు. తన భార్యకు విద్యను నేర్పి తన భార్యను భారత దేశ ప్రథమ ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన గొప్ప దార్శనికుడు మహాత్మ జ్యోతిబాపూలే అని అన్నారు. సమాజం బాగుపడాలంటే మహిళా చైతన్యం ముఖ్యమని, మహిళా చైతన్యం విద్యతోనే సాధ్యమని గ్రహించి ఆ విధంగా మహిళలకు విద్యను నేర్పించిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే అని అన్నారు. మహిళలు బాగు పాడితే కుటుంబం బాగు పడుతుందని అని చెప్పి తన భార్య ద్వారా మహిళలకు విద్యను నేర్పిన విద్య ప్రదాత భారతదేశ ముద్దుబిడ్డ మహాత్మ జ్యోతిబాపూలే భారతదేశానికొక గొప్ప వరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్, ఆకుల ప్రసాద్,మాడవేడి వినోద్ కుమార్, కొయ్యాడ శంకర్, శ్రీలత, బసవసాయి తదితరులు పాల్గొన్నారు.ం



# అమరావతి రెండో దశ భూ సమీకరణకు ఏపీ కేబినెట్ ఆమోదం

ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించేందుకు సీఆర్డీఏకు అనుమతి ఇస్తూ మంత్రివర్గం తీర్మానించింది. ప్రభుత్వ భూమితో కలిపి మొత్తంగా 20 వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించాలన్నా, ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్ సిటీ, రైల్వే స్టేషన్ వంటి భారీ మౌలిక సదుపాయాలు నిర్మించాలన్నా భూమి అత్యవసరం అని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారమే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, కేబినెట్ సమావేశంలో రెండో దశ భూ సమీకరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో భూసేకరణ చేపట్టబోయే గ్రామాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. హరిశ్చంద్రపురం, వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, వడ్డమాను, పెదమద్దూరు, పెదపరిమి గ్రామాలను అధికారులు ప్రతిపాదించారు. ఆయా గ్రామాల్లో భూ లభ్యత, రికార్డులు, యాజమాన్య వివరాలపై అధికారులు సమర్పించిన నివేదికలను కేబినెట్ పరిశీలించింది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు, ఎండ్రాయిలో 2,166 ఎకరాలు, వడ్డమానులో 1,913 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 16,666 ఎకరాలతో పాటు ప్రభుత్వ, అసైన్డ్ భూములను కలిపి మొత్తం 20,494 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

ఇప్పటికే మొదటి విడతలో రైతుల నుంచి సుమారు 34,000 ఎకరాలను ప్రభుత్వం సమీకరించింది. తాజాగా రెండో విడతలో మరో 20,000 ఎకరాలు సేకరించనున్నారు. వీటికి అదనంగా, సుమారు 16,000 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా సీఆర్డీఏకు అప్పగించనున్నారు. దీంతో రాజధాని నిర్మాణం కోసం మొత్తం దాదాపు 70,000 ఎకరాల భూమి అందుబాటులోకి రానుంది.

**రైతులు సహకరించాలి: సీఎం చంద్రబాబు**

ఈ నేపథ్యంలోనే గురువారం సచివాలయంలో రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ భేటీలో, రాజధాని అభివృద్ధికి రైతులు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. రైతుల సహకారం లేకపోతే అమరావతి కేవలం ఒక మున్సిపాలిటీగా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్గత విభేదాలు, అనవసరమైన జేఏసీలతో సమస్యలు సృష్టించవద్దని, ప్రతి చిన్న విషయానికీ సోషల్ మీడియాలో చర్చ చేయొద్దని సున్నితంగా హెచ్చరించారు. రైతులంతా కలిసికట్టుగా ఒకే 'అమరావతి అభివృద్ధి కమిటీ'గా ఏర్పడి రాజధాని నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కేబినెట్ నిర్ణయంతో రెండో విడత ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది.

# మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలు కొనసాగించాలి

## బహుజన సమైక్య సమితి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామతీర్థం అమరేష్

అక్షర విజేత ఎమ్మిగనూరు

బీఎస్పీ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్ నందు మహాత్మ జ్యోతిరావు పూలే 136వ వర్ధంతి వేడుకలకు పాల్గొన్న బిఎస్ఎస్ రాష్ట్ర నాయకుడు రామతీర్థం అమరేష్ హాజరై ఈ సందర్భంగా అమ్రేష్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే 136వ వర్ధంతి సందర్భంగా, విద్య ఒక హక్కు, కులం మరియు లింగం మనల్ని విభజించని భారతదేశం గురించి కలలు కనే ధైర్యం చేసిన ఒక దార్శనికుడిని మనం గుర్తుచేసుకుంటాము. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన అవిశ్రాంత పోరాటం, బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించడం మరియు సమానత్వంపై ఆయన అచంచలమైన నమ్మకం మనకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ప్రతి బిడ్డకు, ముఖ్యంగా ఆడపిల్లకు నాణ్యమైన విద్య లభించేలా చూడటం ద్వారాబీ వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడటం ద్వారాబీ మరియు న్యాయం మరియు కరుణ మన దేశానికి నిజమైన స్తంభాలుగా ఉన్న సమాజాన్ని నిర్మించడం ద్వారా – ఆయన లక్ష్యానికి మనల్ని మనం తిరిగి అంకితం చేసుకుందాం. పూలే వారసత్వం ఈరోజు మరియు రేపు మన చర్యలకు మార్గనిర్దేశం చేస్తుందన్నారు." ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నాయకులు మంచాల లక్ష్మీనారాయణ,



గుద్దిపి సామెల్ నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు సుమాల చార్లెస్ బిఎస్ఎస్ నాయకులు ప్రసన్నకుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల్ని దేశం గర్వించే స్థానంలో నిలపాలన్నదే లోకేశ్ ఆలోచన : ప్రత్తిపాటి

-ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యాబోధన విషయంలో రాజీ పడొద్దని విద్యాశాఖ మంత్రి లోకేశ్ పదేపదే చెబుతుంటారు.

- నాదెండ్ల మండలం సాతులూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీమంత్రి ప్రత్తిపాటి, ఎమ్మెల్యే అరవిందబాబు.







సాతులూరు అక్షర విజేత

నాదెండ్ల మండలం సాతులూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్తిపాటి, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద్ బాబుతో కలిసి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఇరువురూ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించి, కొత్తగా నిర్మించిన డిజిటల్ ల్యాబ్, తరగతి గదిని ప్రారంభించి, విద్యార్థులు.. ఉపాధ్యాయులు.. గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు. వ్యవసాయంపై ఆధారపడి బతికే పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని విద్యార్థుల్ని దేశం గర్వించే స్థాయిలో తీర్చిదిద్దాలన్న సదుద్దేశంతో, ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని, పాఠశాలల అభివృద్ధికి నిధులు కావాలని కోరిన వెంటనే లోకేశ్ వేగంగా స్పందిస్తున్నారని, విద్యార్థులకు ఏ ఇబ్బంది రాకుండా చూసుకోవాలని పదేపదే చెబుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు.

ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు సొంతనిధులతో విద్యార్థులకు మేలు చేస్తున్నారు..

విద్యార్థులకు విలువలతోకూడిన బోధనతో పాటు, సాతులూరులోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు గోరంట్ల శ్రీనివాసరావును మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. మంచి భావాలు కలిగిన మంచి ఉపాధ్యాయుడిగా ఆయన పేరుపొందారని, గతంలో కొండవీడులో పనిచేసినప్పుడు రూ.15లక్షల సొంత నిధులతో అక్కడి పాఠశాలను అభివృద్ధి చేసిన గొప్ప వ్యక్తి శ్రీనివాసరావు అన్నారు.

విద్యారంగాన్ని లోకేశ్ తక్కువ సమయంలోనే సంస్కరించారు : అరవిందబాబు

ప్రజలంతా ఉమ్మడిగా గతప్రభుత్వంపై గొప్ప పోరాటం చేయబట్టే.. 2024 ఎన్నికల్లో కూటమిప్రభుత్వానికి భారీ మెజారిటీ దక్కిందని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో దెబ్బతిన్న రాష్ట్ర విద్యారంగాన్ని.. మంత్రి లోకేశ్ తక్కువ సమయంలోనే సంస్కరించారని చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు బుచ్చారావు, మద్దూరి వీరారెడ్డి, గుర్రం నాగపూర్ణ చంద్రరావు, సాతులూరు గ్రామ నాయకులు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేటలో వ్యభిచార గృహంపై పోలీసుల దాడి- ముగ్గురి అరెస్ట్!



చిలకలూరిపేట అక్షర విజేత

చిలకలూరిపేట పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యభిచార గృహంపై పోలీసులు శుక్రవారం దాడి చేసి, దానిని నిర్వహిస్తున్న మహిళతో పాటు ఇద్దరు విటులను అరెస్టు చేశారు. పట్టణం, గుండయ్యతోట నివాసి అయిన మన్నేపులి సుధా లక్ష్మి (భర్త: వెంకట కృష్ణ) బ్యాంక్ కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని అందులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు చిలకలూరిపేట పట్టణ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.సమాచారం మేరకు, చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీ పి. రమేష్ తన పోలీస్ సిబ్బందితో కలిసి, మధ్యవర్తుల సమక్షంలో సదరు ఇంటిపై శుక్రవారం (ది. నవంబర్28.2025) దాడి చేశారు.పోలీసులు జరిపిన దాడిలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న మన్నేపులి సుధా లక్ష్మితో పాటు, వ్యభిచారానికి వచ్చిన ఇద్దరు విటులు %-% శ్రీగిరి రాజు ఉమా మహేశ్వరరావు, మరియు షేక్ మొహిద్దిన్ షరీఫ్లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం జరిగింది

# అట్రాసిటీకి గురైన కల్లుకుంట గోవిందమ్మకు ప్రభుత్వం కల్పించిన స్థలాన్ని కబ్జా

కబ్జా చేసిన బకాసురులను వెంటనే చర్యలు తీసుకోవాలి -బిఎస్ఎస్ డిమాండ్

రెవెన్యూ పరిపాలనకు సంఘీభావం





అక్షర విజేత ఎమ్మిగనూరు

అవమానవీయ ఘటనకు లోనైనా అట్రాసిటీ బాధితురాలైన గోవిందమ్మకు ఎమ్మిగనూరు టౌన్ మిలటరీ కాలనీ నందు ప్లాట్ నెంబర్ 70 ను కేటాయిస్తామని స్థానిక తహసిల్దార్ వారు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రకటన చేసి రెండు వారాలు అయింది, ఇంతలోనే భూ బకాసురులు ఆ స్థలంలో బండలు పాతుకుని అధికారుల పరిపాలనకు ఆటంకం కలగజేయడం వలన బహుజన సమైఖ్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రామతీర్థం అమరేష్ అధికారులకు సంఘీభావంగా ఆర్ ఐ హాఫీజ్, వీఆర్వో బసవరాజు తో కలసి ఆ స్థలాన్ని పరిశీలించి రెవిన్యూ రికార్డులలో ఎవరి పేరు లేకపోయినా అనాముకులు వచ్చి ఇలా స్థలాన్ని కబ్జా చేస్తే అది చట్ట వ్యతిరేకమని అన్నారు, ఈ స్థలం గోవిందమ్మకు వచ్చేంతవరకు అధికారులకు బహుజన సమైక్య సమితి తరపున సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎస్ అనుబంధ సంఘాలు బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం నాగేంద్ర, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు కదిరికోట బతుకమ్మ, సుమాల చార్లెస్, బి ఎస్ ఎస్ నాయకులు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



తాడేపల్లిగూడెం (అక్షర విజేత)

పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక తేతలి సత్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన విజయకేతనం స్టడీ మెటీరియల్ ను జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పదో తరగతిలో అత్యధిక శాతం ఉత్తీర్ణమి కావాలని ఉద్దేశంతో నిపుణులతో మెటీరియల్ను తయారు చేయించడం జరిగిందన్నారు. వితి విద్యార్థి బిందులోనే పాఠ్యాంశాలను చదవడం ద్వారా అత్యధిక మార్కులు సాధించన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎంఈడి బిఈడి చేసిన ఉపాధ్యాయులు ఉంటారని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని కోరారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని విద్య , క్రీడా హబ్ గా తీర్చి దిద్దుతామ న్నారు. ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎక్కడా లేనివిధంగా అన్ని రకాల క్రీడలను సంబంధించిన గ్రౌండ్స్ను తయారు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంగణం నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయికి విద్యార్థులు వెళ్లే విధంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో జడ్పిటిసి ముఖ్య ఆంజనేయులు , ట్రైలర్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశం స్వామి, ఎన్ వి సత్యనారాయణ, పాలు వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి డ్రామా ఏపీ డి మల్లికార్జున రావు, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ జ్యోతి, పెంటపాడు ఎంఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.



# ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా మహాసభ ఘన విజయం..

రాష్ట్ర అధ్యక్షుడిగా ఏచూరి శివ ఏకగ్రీవ ఎన్నిక..



విజయవాడ అక్షర విజేత

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) అనుబంధ సంస్థ అయిన రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా మహాసభ శుక్రవారం నాడు విజయవాడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్ నందు అత్యంత ఘనంగా జరిగింది. ఈ మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏచూరి శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జర్నలిస్టుల సంక్షేమం, ఎలక్ట్రానిక్ మీడియా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

**చిలకలూరిపేట నేతల అభినందనలు...**

ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన అధ్యక్షులు ఏచూరి శివను చిలకలూరిపేట ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు మరియు ప్రింట్ మీడియా నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు ఆయనను శాలువాతో సత్కరించి తమ శు భాకాంక్షలు తెలిపారు.

# చిలకలూరిపేటనారాయణ పాఠశాల విద్యార్థుల గొప్ప మనసు







చిలకలూరిపేట అక్షర విజేత

చిలకలూరిపేట స్థానిక నారాయణ పాఠశాల విద్యార్థులు తమ మంచి మనసును చాటుకున్నారు పట్టణం లోని పోలిరెడ్డి పాలెం దగ్గర ఉన్న ప్రశాంతి వృద్ధాశ్రమం కు వెళ్లి కూరగాయలు పండ్లు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు కార్యక్రమానికి ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ శేషగిరి రావు మాట్లాడుతూ చిన్నారులు చిన్నతనం నుంచే సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోష దగ విషయం అన్నారు తా ద్వారా సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తయారు అవుతారు అని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావు ఏజీఎం లక్ష్మణ రెడ్డి జెడ్ సి ఓ గౌసియావైస్ ప్రిన్సిపాల్ నాగవర్ధిని మరియు ఉపాధ్యాయ ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు